సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 30 । జూలై । 2023



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్నకు చెందిన 20 కోడెలను తొర్రూర్ మండలం జీకే తండాకు చెందిన సోమేశ్వరగోశాలకు అందజేశారు.



చేపలు పడుతూ నిరసన

రుద్రంగి(వేములవాడ): రుద్రంగిలోని ప్రధాన రహదారి ధ్వంసమై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు శనివారం చేపలు పడుతూ నిరసన తెలిపారు.

గరిష్టం/కనిష్టం 30.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా ఆయాజ్



మహ్మద్ అయాజ్

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న మహ్మద్ ఆయాజ్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయాజ్ గ్రేడ్–2 మున్సిపల్ కమిషనర్ నుంచి పదోన్నతిపై సిరిసిల్లకు బదిలీపై వస్తున్నారు. ఇక్కడ చాలా రోజులుగా పనిచేస్తున్న వెల్దండి సమ్మయ్య వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు.

సినారెకు ఘన నివాళి



సిరిసిల్లలో సినారెకు నివాళి అర్పిస్తున్న రచయితలు

సిరిసిల్లకల్చరల్: సినారె జయంతిని శనివారం సిరిసిల్లలో ఘనంగా నిర్వహించారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గాంధీ సర్కిల్‌లో సినారె చిత్రపటానికి నివాళి అర్పించారు. గ్రంథాలయ భవనంలో జరిగిన వేడుకలకు ఆ సంస్థ జిల్లా చైర్మన్ ఆకునూరి శంకరయ్య అధ్యక్షత వహించారు. శంకరయ్య మాట్లాడుతూ మారుమూల గ్రామంలో జన్మించినప్పటికీ అపార ప్రతిభతో తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. సినారె విగ్రహ ఏర్పాటుకు మంత్రి కేటీఆర్ రూ.10లక్షలు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. కవులు జూకంటి జగన్నాథం, జనపాల శంకరయ్య, వాసరవేని పరశురాం, ఎలగొండ రవి, వెంగల లక్ష్మణ్, బూర దేవానందం, ఆడెపు లక్ష్మణ్, బుర్క గోపాల్, గోనె బాల్‌రెడ్డి, వెంగల నాగరాజు, చిటికెన కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు



పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది

వేములవాడ: భారీ వర్షాలకు మూలవాగు ఉప్పొంగి ప్రవహించడంతో వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు, అధికారులు శనివారం గంగమ్మతల్లికి పూజలు చేశారు. చైర్‌పర్సన్ మాధవి మాట్లాడుతూ మూలవాగు ప్రవహించడంతో పట్టణంలో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కౌన్సిలర్లు నరాల శేఖర్, బింగి మహేశ్, మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, గోలి మహేశ్, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆదుకుంటాం



ఇళ్లను పరిశీలిస్తున్న అగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వర్షాలతో కూలిపోయిన ఇళ్ల బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో ధ్వంసమైన ఇళ్లను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులతో నష్టంపై నివేదిక తయారు చేయించి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి కడు పేదరికం అనుభవిస్తున్న వారికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు అందేలా కృషి చేస్తామన్నారు. దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్లను మరమ్మతు చేయాలని సంబంధిత శాఖల అధికారులను కోరినట్లు తెలిపారు. పందిర్ల పర్శరాములు, ఎడ్ల సందీప్, శివరామకృష్ణ, ఎడ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

పద్మబ్రాహ్మణుల మహాసభ కరపత్రాలు ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: ఆగస్టు 3, 4 తేదీల్లో నిర్వహించే పద్మబ్రాహ్మణుల మహాసభ కరపత్రాలను అఖిల భారత పద్మబ్రాహ్మణ పౌరోహిత సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. సిరిసిల్లలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. కర్ణాటకలోని గోకర్ణం క్షేత్రంలో జరిగే కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. సంఘం ప్రచార కార్యదర్శి చిలుక నర్సప్ప, మంచికట్ల కోటేశ్వర్, భూపతి, మల్లేశం, ప్రసాద్, శంకర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

నష్టం వంద కోట్ల పైనే..



పొలంలో నిల్చున్న ఇతను కోనరావుపేట మండలం మరిమడ్లకు చెందిన మాట్ల కుమార్. మరిమడ్ల–గర్జనపల్లి శివారుల్లోని చెక్‌డ్యామ్ కోతకు గురవడంతో పొలం మునిగింది. 30 గుంటలలో ఇసుక మేటలు వేసింది. మరిమడ్లలోనే పది మంది రైతులకు చెందిన 8 ఎకరాల్లో పొలాలు కోతకు గురైంది. జిల్లాలోని అన్ని గ్రామాల్లో 1,800 ఎకరాల్లో ఇలాగే పంట పొలాలను ఇసుక మేటలు కప్పేశాయి.

కూలిన ఇంటి ముందు నిల్చున్న ఇతను బోయినపల్లి మండలం మర్లపేటకు చెందిన పర్లపల్లి రాజయ్య. వర్షాలకు తడిసిపోయి ఇల్లు కూలడంతో రూ.3 లక్షల మేరకు నష్టం జరిగింది. ఒక్క రాజయ్యనే కాదు. ఇలా జిల్లా వ్యాప్తంగా 575 ఇళ్లు కూలిపోయాయి.





ఇది ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్–అనంతగిరి వెళ్లే దారిలో పొలంలో పడిపోయిన విద్యుత్ స్తంభం. పొలంలో ఇసుకమేటలు వేయడంతోపాటు ఇలా స్తంభం కూలిపోయింది. జిల్లా వ్యాప్తంగా వందలాది విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. ట్రాన్స్‌పార్మర్లు పడిపోయాయి. భారీ వర్షాలతో జిల్లాలో సెస్‌కు రూ.70 లక్షల మేరకు నష్టం వాటిల్లింది.

కింది ఫొటో.. గంభీరావుపేట మండలం మల్లుపల్లె–నాగంపేటల మధ్య కోతకు గురైన రోడ్డు. మూలవాగు వరద ఉధృతికి రోడ్డు తెగిపోగా.. వందలాది ఎకరాల పంట పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. జిల్లాలో రోడ్లు భవనాలశాఖకు చెందిన 26 ప్రాంతాల్లో రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేలు, లోలెవల్ వంతెనలు కూలిపోగా.. పీఆర్ శాఖకు చెందిన 45 ప్రదేశాల్లో బీటీ రోడ్లు, కల్వర్టులు తెగిపోయాయి. ఇలా జిల్లాలో ముసురువర్షాలతో అపార నష్టం వాటిల్లింది.



- కొట్టుకుపోయిన కల్వర్టులు.. కూలిన లోలెవల్ వంతెనలు
- దెబ్బతిన్న రవాణా వ్యవస్థ
- తెగిన చెక్‌డ్యామ్‌లు, గండి పడిన చెరువులు
- 1,800 ఎకరాల పంటలపై ఇసుక మేటలు
- సెస్‌కు రూ.70 లక్షల నష్టం
- కూలిన పాత ఇండ్లు 575



ఎల్లారెడ్డిపేటలో కూలిన ఇల్లు



తెగిపోయిన వేములవాడ-రామన్నపేట తారురోడ్డు



మామిడిపల్లి-నిజామాబాద్ మధ్య కొట్టుకుపోయిన కాజ్‌వే

జిల్లాలో నష్టం వివరాలు(ప్రాథమిక అంచనా)

ప్రభుత్వశాఖ	ఎన్ని చోట్ల	నష్టం
రోడ్లు భవనాలు	26	రూ.30 కోట్లు
పంచాయతీరాజ్	45	రూ.25 కోట్లు
వ్యవసాయశాఖ	1800 ఎకరాలు	రూ.35 కోట్లు
కూలిన ఇళ్లు	575	రూ.12.87 కోట్లు
స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు	100కు పైగా..	రూ.70 లక్షలు
మొత్తం		రూ.103.57 కోట్లు

సిరిసిల్ల: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు వచ్చిన వరదలతో అపారనష్టం ఏర్పడింది. 1,800 ఎకరాలలో పంటనష్టం ఏర్పడగా.. పలు కల్వర్టులు తెగిపోగా, లోలెవల్ వంతెనలు కూలిపోయాయి. విద్యుత్‌స్తంభాలు విరిగిపోగా, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగానే నష్టం ఏర్పడింది.

తెగిన కల్వర్టులు

బోయినపల్లి మండలంలోని రామన్నపేట నుంచి వేములవాడ వెళ్లే బీటీ రోడ్డుకు తెగిపోయింది. రత్నంపేట, దేశాయిపల్లి గ్రామాల ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. మర్లపేట–విలాసాగర్ మీదుగా కరీంనగర్ వెళ్లే రోడ్డు కల్వర్టు తెగిపోయింది. ఈ కల్వర్టును ఐదు నెలల కిందట రూ.9లక్షలతో నిర్మించారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి–నిజామాబాద్ మధ్య మూలవాగుపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వే కోతకు గురైంది. బావుసాయిపేట–వెంకట్రావుపేట మధ్య నిర్మించిన కాజ్‌వే కొట్టుకుపోయింది. వట్టిమల్ల–నిమ్మపల్లి మధ్య మూలవాగుపై నిర్మించిన కాజ్‌వే వరదలో కలిసింది. ఇల్లంతకుంట మండలంలోని పలు రోడ్లు కోతకు గురయ్యాయి. రుద్రంగి మండలం మానాలతో పలు గిరిజన గ్రామాల రోడ్లు తెగిపోయాయి. వీర్నపల్లి మండలంలోని పలు గ్రామాల రోడ్లు కొట్టుకుపోయాయి. ఎల్లారెడ్డిపేటలోనూ రోడ్లు తెగిపోయాయి.

రైతులకు అపార నష్టం

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ రైతులకు అపారనష్టం జరిగింది. జిల్లాలో 1,800 ఎకరాల్లో వరి పంటలు నీటమునిగాయి. సిరిసిల్ల సమీపంలోని చిన్నబోనాల పెద్ద చెరువుకు గండి పడడంతో 50 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. పంట నష్టాలపై అధికారులు అంచనాలు వేస్తున్నారు.

కూలిన ఇళ్లు

జిల్లా వ్యాప్తంగా 575 ఇళ్లు కూలినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. 255 గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోనూ పాత ఇళ్లు కూలాయి. రోజుల తరబడి కురిసిన వర్షాలతో మట్టి ఇళ్లు కూలిపోయాయి. ఆ ఇళ్లలో నివసించే వారు నిరాశ్రయులయ్యారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట దుకాణాల్లోకి వరదనీరు రావడంతో బియ్యం, వస్త్రాలు, ఇతర సామగ్రి తడిసిపోయాయి.

శాశ్వత పనులకు రూ.వంద కోట్ల పైమాటే

జిల్లాలో తెగిపోయిన రోడ్లు, కొట్టుకుపోయిన కల్వర్టులు, కోతకు గురైన చెక్‌డ్యామ్‌లు, గండిపడిన చెరువులు, మేటలు వేసిన పొలాలను తొలగించేందుకు రూ.వంద కోట్లకు పైగా ఖర్చు అవుతుండగా.. తాత్కాలిక మరమ్మతులకు రూ.లక్షల్లో వెచ్చించాల్సి ఉంది. జిల్లాలో భారీ వర్షాలు రూ.103.57కోట్ల నష్టాలను మిగల్చగా.. అంతకు మించి బాధితులకు మనోవేదన కలిగించింది.

కదులుతున్న కేటుగాడి డొంక

- బయటకొస్తున్న బాధితులు
- పోలీస్ కేసు నమోదు

సిరిసిల్లక్రైం: కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నట్లు నమ్మించి అందరి సొమ్మును కొల్లగొట్టిన కేటుగాడి మోసాల చిట్టా బయట పడుతోంది. రమేశ్‌చారి బాధితులు బయటకు వస్తున్నారు. రమేశ్‌చారి చేతుల్లో మోసపోయిన వారు సమాజంలో పేరు, పలుకుబడి ఉన్న వారు కావడంతో బహిరంగంగా చెప్పేందుకు ముందుకురావడం లేదు. రమేశ్‌చారి బాధితుల సంఘం పేరిట వాట్సాప్‌లో ఓ గ్రూప్ క్రియేట్ చేశారు. ఈ సంఘంలో దాదాపు 100 మంది ఉన్నట్లు బాధితుల్లో ఒకరు తెలిపారు.

అనధికారి దందాకు.. అధికారిక పత్రాలు

రమేశ్‌చారి చట్టం నుంచి తప్పించుకునేందుకు ముందుగానే ప్రణాళికలు వేసి.. కంపెనీని రిజిష్టర్ చేసినట్లు పత్రాలు బయటకొచ్చాయి. మన తెలంగాణ ఫుడ్ అండ్ ఎలక్ట్రానిక్స్ పేరిట 2022లో రిజిష్టర్ చేసినట్లు ఆధారాలున్నాయి. ఆ కంపెనీలో రమేశ్‌చారితోపాటు వీర్నపల్లి మండలం అడవిపదిరకు చెందిన పూర్ణచందర్ భాగస్వామిగా ఉన్నారు.

ఉద్యోగాలతో ప్రారంభమై

ముందుగా రమేశ్‌చారి అధికారిపార్టీ నాయకులతో ఫొటోలు దిగి, తాను పార్టీ బలోపేతానికి పనిచేస్తున్నానని, తనకు పార్టీలో సేవదళ్ పేరిట అవకాశం ఇచ్చారని నమ్మబలికాడు. ఎమ్మెల్యేలు, మంత్రులతో మాట్లాడి ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షలు కాజేశాడు. ఉద్యోగాలు రాకపోవడంతో వారికి డబ్బులు చెల్లిస్తానని బాధితులందరికీ బాండ్ పేపర్ రాసిచ్చాడు. కానీ ఎవరికీ సొమ్ము తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుల ఫిర్యాదుతో పీడీ యాక్ట్ నమోదైంది. దీనిపై 11 నెలలపాటు జైలు జీవితం గడిపి బయటకు వచ్చాడు. ఇక నుంచి ఉద్యోగాలు కాకుండా ఎలక్ట్రానిక్స్ అమ్మకాలు జరిపేందుకు పన్నాగం పన్నాడు. దీనిలో భాగంగానే గ్రామాల్లోని ఆర్‌ఎంపీలు, ఉపాధ్యాయులు, బీడీ కంపెనీ నిర్వాహకులే లక్ష్యంగా వ్యాపారం మొదలు పెట్టాడు. తక్కువ ధరకు వస్తువులను సరఫరా చేయడంతో చందును అనేకమంది నమ్మినట్లు చెప్పారు. వ్యాపారం నిమిత్తం వేములవాడలో సొంతిల్లు తీసుకుని ఉంటున్నారని మరొకరు వివరించారు.

కేసు నమోదు

సిరిసిల్లలోని నెహ్రూనగర్‌కు చెందిన ఉడుత సాయికుమార్, జగ్గారావుపల్లికి చెందిన నూకల వెంకటేశ్ ఫిర్యాదుతో పూర్ణచందర్, కె.రమేశ్‌చారిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.



రాజన్న సన్నిధిలో భక్తులు

వేములవాడ: రాజన్న దర్శనానికి శనివారం 10 వేల మంది భక్తులు తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సునావత్ ప్రవీణ్‌నాయక్ దర్శించుకున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- వేములవాడలో పర్యటించిన కలెక్టర్
- మూడు రోజులు డ్రై డే పాటించాలని సూచన



పర్యటిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. వేములవాడలో శనివారం పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంబేడ్కర్‌నగర్ నుంచి మొదలుకుని మెయిన్‌రోడ్డు వరకు కాలినడకన పరిసరాలు పరిశీలిస్తూ..స్థానికులతో మాట్లాడుతూ ముందుకెళ్లారు. చెత్త ట్రాక్టర్లు ప్రతిరోజు వస్తున్నాయా? మిషన్ భగీరథ నీరు వస్తుందా ? అంటూ ఆరా తీశారు. డ్రెయినేజీలు, రోడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండడంతో ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాలు డ్రైడే పాటించాలని సూచించారు. దోమలు పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ అన్వేశ్‌ను ఆదేశించారు.

సీజనల్ వ్యాధులను కట్టడి చేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్

సిరిసిల్ల: జిల్లాలో కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వాటిని కట్టడి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలో శనివారం డాక్టర్లతో సమీక్షించారు. మందుల కొరత లేకుండా చూడాలని, రోగులను ఆప్యాయంగా పలకరించి వైద్యసేవలు అందించాలన్నారు. డాక్టర్లు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లా ఆస్పత్రిలో అన్ని వసతులు సమకూరాయని, ఈ మేరకు రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరగాలని, ఆపరేషన్లు తగ్గించాలన్నారు. కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లను అందించాలన్నారు. జిల్లా ఆస్పత్రికి అవసరమైన వసతుల కల్పనకు మంత్రి కేటీఆర్ సిద్ధంగా ఉన్నారని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో పరీక్షలకు వచ్చిన గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందించారు. జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, ఆర్‌ఎంవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టు నుంచి కరీంనగర్ ఎల్‌ఎండీ ప్రాజెక్టులోకి నీటి విడుదల తిరిగి ప్రారంభించారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టు నాలుగు గేట్ల ద్వారా ఎల్‌ఎండీకి 10,284 క్యూసెక్కుల నీరు తరలుతోంది. ప్రాజెక్టులోకి 8 వేల క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టులో 20.86 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

వీటీడీఏ కార్యదర్శిగా సమ్మయ్య



సమ్మయ్య

సిరిసిల్లటౌన్: వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న వెల్దండి సమ్మయ్య నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర మున్సిపల్‌శాఖ ప్రధాన కార్యదర్శి అరవింద్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా వెల్దండి సమ్మయ్య సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా నాలుగేళ్లు పనిచేశారు. సెకండరీ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా సిరిసిల్లలో విధుల్లో చేరగా..ఇటీవల ఫస్ట్‌గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా ప్రమోషన్ పొందారు. శనివారం జరిగిన బదిలీల్లో భాగంగా సమ్మయ్యను వీటీడీఏ సెక్రటరీగా నియమించారు. ఇన్ని రోజులు హైదరాబాద్‌లోని వీటీడీఏ కార్యదర్శి పోస్టులో ఐఏఎస్ ఆఫీసర్ కొనసాగారు. ఇటీవల కార్యాలయం వేములవాడలో ఏర్పాటు చేశారు. ఈక్రమంలో వెల్దండి సమ్మయ్య మొదటి కార్యదర్శిగా నియమితులవడం ప్రత్యేకత సంతరించుకుంది.

క్లుప్తంగా

అన్నదాతలను ఆదుకోవాలి


సమావేశంలో నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. మండలంలో గత వారం రోజుల నుంచి కురిసిన వర్షాలకు వరి పొలాలు పూర్తిగా దెబ్బ తిన్నాయని, సుమారు 100 ఎకరాల్లో నాట్లు వేసిన పొలాల్లో ఇసుక మేటలు వేయడం జరిగిందన్నారు. కొంత మంది ఇళ్లు వర్షాలకు నేలమట్టం కాగా, వారికి తాత్కలిక సాయం కింద రూ.20 వేలు నగదు ఇచ్చి డబుల్‌బెడ్ రూంలు మంజూరు చేయాలన్నారు. తిమ్మాసీకుంటకు గండి పడిందని వెంటనే మరమ్మతు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి లింగం గౌడ్, నాయకులు లక్ష్మారెడ్డి, రాజునాయక్, బాబు, బుచ్చాగౌడ్, గిరిధర్‌రెడ్డి, మల్లారెడ్డి, సతీష్, రాంరెడ్డి, రఫీక్, లక్ష్మీనర్సయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ నాయకుల నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు


ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని నామాపూర్‌లో మెయిన్ రోడ్డు నుంచి ఇందిరమ్మకాలనీకి వెళ్లే రహదారిపై శనివారం కాంగ్రెస్ నాయకులు వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఏటా వానకాలంలో ఈ దారి బురదమయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కాలనీ ఏర్పడి 15 ఏళ్లు గడిచిపోయాయని, కనీసం ఇప్పటి వరకు సీసీరోడ్డు కూడా వేయలేదన్నారు. ఇప్పటికైనా సీసీరోడ్డు నిర్మించాలని కోరారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌ల మధ్య సమన్వయ లోపంతో సీసీ రోడ్డు వేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గన్నె భానురెడ్డి, మాదాసు అనిల్, మెరుగు శివ, బండపల్లి నవీన్, కొమురయ్య, దశరథం, శ్రీనివాస్, మహేందర్, బాల్‌రెడ్డి, ప్రశాంత్, ప్రవీణ్, నవీన్, వంశీ, ప్రసాద్, శ్రీధర్, కల్యాణ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

వేములవాడఅర్బన్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో నేరుగా రెండో సంవత్సరంలోకి ప్రవేశాలకు టీఎస్ ఈసెట్ 2023లో ర్యాంకులు సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాలను ఈ నెల 31 నుంచి వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వర స్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరిశీలించనున్నట్లు ప్రిన్సిపాల్ డా.బి.రాజగోపాల్ తెలిపారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 2 వరకు స్లాట్ బుకింగ్ చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లు ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని తెలిపారు.


రంగంపేట మార్గండి చెరువు మత్తడివద్ద చేపలు పడుతున్న స్థానికులు


జలకళ సంతరించుకున్న వట్టిమల్ల నారాయణ చెరువు


నిండుకుండలా రంగంపేట జంపన్న చెరువు



అలుగుపారుతున్న

అన్నల చెరువులు!

వర్షాలతో జలకళ సంతరించుకున్న జలవనరులు

సాక్షి, కరీంనగర్ డెస్క్:

'కాకతీయులు.. రెడ్డిరాజులు చెరువులు తవ్వించారని.. అశోకుడు మొక్కలు నాటించెను అని చదువుకున్నాం'.. కానీ.. సమసమాజ స్థాపన కోసం ఆయుధాలు చేతపట్టి, అడవుల్లో సంచరించే అన్నలు(నక్సలైట్లు) 26 ఏళ్ల క్రితం రాజన్నసిరిసిల్ల జిల్లాలో చెరువులు తవ్వారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఇదో అధ్యాయం. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ఆ చెరువులు జలకళ సంతరించుకొని మత్తళ్లు దుంకుతున్నాయి. 1990–2000 మధ్య కాలంలో సిరిసిల్ల ప్రాంతంలో పట్టున్న సీపీఐ (ఎంఎల్) మావోయిస్టు, జనశక్తి విప్లవగ్రూపు నక్సలైట్లు పోటాపోటీగా మూడు చెరువులు తవ్వారు.

- తుపాకులు పక్కనపెట్టి.. తట్టాపారలు పట్టి
- 26 ఏళ్లక్రితం రంగపేట, వద్దిమల్ల, వట్టిమల్ల గ్రామాల్లో చెరువుల తవ్వకం
- ఆనాటి కరువును తీర్చిన నక్సలైట్లు

కరువు కోరల్లో పల్లెలు..

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి, కోనరావుపేట మండలాల్లోని అటవీ గ్రామాల్లో మూడు దశాబ్దాల క్రితం అడవిలో అన్నలదే రాజ్యం. ఏళ్లుగా బీడుగా మారిన భూములు.. కరువు కోరల్లో బతుకులు.. చెరువు నిర్మిస్తే బాగుండు.. బుక్కెడు బువ్వ దొరుకుతుందని ఆశించిన నిరుపేదలు.. ఏళ్ల తరబడి పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. అలాంటి పరిస్థితుల్లో అడవిలో అన్నలు వీర్నపల్లి మండలంలోని రంగంపేటలో మార్గండి చెరువు (ప్రస్తుతం జంపన్న చెరువు), మద్దిమల్ల రాయిని చెరువు, కోనరావుపేట మండలంలోని వట్టిమల్లలో నారాయణ చెరువు తవ్వి కరువు తీర్చారు.

మొదట మద్దిమల్ల చెరువుకు శ్రీకారం..

వీర్నపల్లి మండలంలోని మద్దిమల్ల రాయిని చెరువు తవ్వకంలో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ (మావోయిస్టు) కీలక పాత్ర పోషించింది. గుట్టల ప్రాంతం నుంచి వచ్చే నీరు వృథాగా ఒర్రెల ద్వారా వెళ్లిపోతోంది. ఆ నీటిని ఆపితే ఊరందరికీ మేలు జరుగుతుందని అప్పటి పీపుల్స్‌వార్ దళ నాయకుడు మధు ఉరఫ్ కొట్టాల మోహన్‌రెడ్డి భావించారు. మద్దిమల్లలో కులాలవారీగా కమిటీలు వేసి, 11 మందికి ఒక గ్రూపు ఏర్పాటు చేశారు. టీమ్ లీడర్లను నియమించి, చెరువు తవ్వకానికి శ్రీకారం చుట్టారు. 75 రోజులపాటు నిత్యం 600 మంది గ్రామస్తులు ఇందులో భాగస్వాములయ్యారు. సమీప గ్రామాలవారు కూడా నక్సలైట్ల ప్రోద్బలంతో శ్రమదానం చేశారు. సాయుధ నక్సలైట్లు తుపాకులను పక్కనపెట్టి, చెరువు కట్ట పోసేందుకు తట్టలు పట్టి, పని చేయడం విశేషం. ఈ ప్రాంత ట్రాక్టర్ యజమానులు సైతం సహకారం అందించడంతో చెరువు నిర్మాణం పూర్తయింది. నక్సలైట్ల నేతృత్వంలో తవ్విన తొలి చెరువు ఇదే. ఈ వానాకాలంలో కురుస్తున్న వర్షాలకు మత్తడి దుంకుతోంది.

నెలరోజుల్లో పూర్తయిన 'జంపన్న'..

మావోయిస్టులు మద్దిమల్లలో చెరువు నిర్మించడాన్ని స్ఫూర్తిగా తీసుకున్న సీపీఐ(ఎంఎల్) జనశక్తి అప్పటి జిల్లా కార్యదర్శి జంపన్న వీర్నపల్లి మండలంలోని రంగంపేట శివారులో మార్గండి చెరువు తవ్వకానికి శ్రీకారం చుట్టారు. ఊరిలోని కుల సంఘాలను ఏకం చేసి, వంతుల వారీగా పనుల్లో భాగస్వాములు కావాలని జనశక్తి పిలుపునిచ్చింది. దీంతో నెల రోజుల్లోనే చెరువు తవ్వకం పూర్తయింది. సాయుధ జనశక్తి నక్సలైట్లు సైతం శ్రమదానం చేశారు. నీరు వన్యప్రాణులకు, పశువులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం జలకళ సంతరించుకుంది. చెరువు మత్తడి వద్ద స్థానికులు చేపలు పడుతున్నారు.

నారాయణ చెరువుకు రెండేళ్లు..

కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల శివారులో జనశక్తి నక్సలైట్లు నారాయణ చెరువు తవ్వారు. వారి పిలుపుతో తరలివచ్చిన ప్రజలు శ్రమదానం చేశారు. మండల ఇంజినీర్ల నుంచి సాంకేతిక సహకారం తీసుకున్నారు. ట్రాక్టర్లు, పరికరాలను పార్టీ పరంగా సమకూర్చారు. ఈ చెరువు పనులు రెండేళ్లపాటు జరిగాయి. చెరువు ప్రస్తుతం నిండుకుండను తలపిస్తోంది. నక్సలైట్లు నిర్మించిన ఈ మూడు చెరువులను అప్పట్లో మానవ హక్కుల సంఘం నేత బాలగోపాల్ బృందం సందర్శించింది. మావోయిస్టు దళనేత కొట్టాల మోహన్‌రెడ్డి, జనశక్తి నేత జంపన్న తమ సొంత గ్రామాల్లోనే చెరువులు తవ్వారని బాలగోపాల్ అప్పట్లో విమర్శనాత్మక వ్యాసాలు రాయడం చర్చనీయాంశమైంది.

నేనూ పనికి పోయిన



ఊరంతా చెరువు కోసం పని చేసిన్రు. నేనూ నెలరోజుల పాటు పోయిన. ఆ చెరువే ఇప్పుడు ఆధారమైంది. నాకు రెండెకరాల పొలం ఉంది. జంపన్న చొరవతోనే చెరువు తవ్వినం. అందుకే దానికి ఆయన పేరు పెట్టిన్రు.

– భూక్యా తేజనాయక్, రైతు, రంగంపేట

ఊర్లకు రోడ్డు వేశాం



రంగంపేటలో పార్టీ ప్రోద్బలంతో మార్గండి చెరువు తవ్వాం. అప్పటికే ఊరిలోకి రోడ్డు లేకుంటే వేశాం. ట్రాక్టర్లకు డీజిల్‌ను పార్టీ పరంగా సమకూర్చాం. జంపన్న నాయకత్వంలో కులాలవారీగా జనాన్ని కదిలించాం.

– ఎడ్ల లక్ష్మీరాజం ఉరఫ్ సాగర్, జనశక్తి రాష్ట్ర మాజీ నాయకుడు


రంగంపేట మార్గండి చెరువు వద్ద జంపన్న స్మారక స్తూపం

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ


మాట్లాడుతున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: గతంలో ఎన్నడూ లేని విధంగా సిరిసిల్ల పట్టణం అభివృద్ధి చెందితే కాంగ్రెసోళ్లు ఓర్వలేక పోతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యం వల్ల పట్టణంలో వరదలొస్తే మంత్రి కేటీఆర్ తప్పిదంగా అభివర్ణించడం కాంగ్రెసోళ్ల మూర్ఖత్వానికి నిదర్శనంగా పేర్కొన్నారు. రూ.10కోట్లు విలీన గ్రామాలకు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. భారీ వర్షాల్లో సైతం అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలిచారని, ప్రమాదంలో ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గల్లంతు అవుతోందన్న భయంతోనే పారదర్శక పాలన, సిరిసిల్ల అభివృద్ధిపై విమర్శలు చేస్తున్నారని ఇది ప్రజలు సహించబోరన్నారు. మంత్రి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు లేదని, మరోసారి ఇదేతీరు కనబరిస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య


తిరుపతి(ఫైల్)

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన రైతు పత్తెం తిరుపతి(39) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. తిరుపతి తనకున్న ఎకరం వ్యవసాయ భూమితో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం కూతురు వివాహం చేశాడు. రెండేళ్లుగా భారీ వర్షాల కారణంగా సాగు చేసిన పత్తి దిగుబడి రాలేదు. మరో వైపు కూతురు పెళ్లి కోసం చేసిన రూ.5లక్షల అప్పు పెరిగిపోవడంతో అప్పు తీర్చే దారి లేక మనస్తాపం చెంది వ్యవసాయ భూమిలోనే పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు కరీంనగర్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య రజిత, కూతురు, కుమారుడున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మోతిరామ్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఅర్బన్: రాష్ట్రంలోని మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు భూక్యా రెడ్డినాయక్ ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీల్లో ప్రతి వార్డు అభివృద్ధికి ఏడాదికి రూ.50లక్షలు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. నిలిచిపోయిన ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, చైర్మన్‌లకు రూ.లక్ష, కౌన్సిలర్లకు గౌరవ వేతనాలు ఇవ్వాలన్నారు. అలాగే రూ.10వేలు శాశ్వత పెన్షన్ మంజూరు చేయాలని, కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం అందించాలన్నారు. ఈనెల 31న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు పై అంశాలపై చర్చించి, శాసన సభ సమావేశాల్లో ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

చట్టంలో మార్పుతోనే సమాజంలో మార్పు

- యూసీసీ అవగాహన సదస్సులో వక్తలు


యూసీసీపై అవగాహన కల్పిస్తున్న గిరిధర్ మామిడి

సిరిసిల్లకల్చరల్: కాలానుగుణంగా సమాజంలో మార్పులు వస్తేనే సమాజంలో మార్పు వస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మతాలకు అతీతంగా ఒకే చట్టం అమలులో ఉండాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్ర చర్చ జరగాలని కోరారు. యూనిఫామ్ సివిల్ కోడ్(ఉమ్మడి పౌరస్మృతి)పై సిరిసిల్లలోని సాయికృష్ణ ఫంక్షన్‌హాల్‌లో శనివారం సామాజిక సమరసత వేదిక, ప్రజ్ఞా భారతి, తపస్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు గిరిధర్ మామిడి, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ నిరంజనాచారి హాజరై మాట్లాడారు. విభిన్న మతాలు, సంస్కృతుల సమ్మేళనమైన దేశంలో ఆయా మతాలకు అనుగుణంగా ఉన్న పలు విధానాలపై ఏకరూపత సాధించే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం విషయంలో ఒక్కో మతంలో ఒక్కో విధానాన్ని అవలంభిస్తున్నారన్నారు. దీని కారణంగానే ఆయా సామాజికవర్గాల్లోని మహిళలు హక్కులకు దూరమవుతున్నారన్నారు. అన్ని మతాలకు అతీతంగా మహిళల హక్కులను పరిరక్షిస్తూ చట్టపరమైన రక్షణ కల్పించే దిశగా రూపొందిస్తున్న చట్టమే ఉమ్మడి పౌరస్మృతి అని స్పష్టం చేశారు. ఈ సదస్సులో సామాజిక సమరసత వేదిక బాధ్యుడు మోర శ్రీనివాస్, తపస్ బాధ్యులు లెంకల జయకృష్ణారెడ్డి, అడ్వకేట్ మారుతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, కౌన్సిలర్ గూడూరి భాస్కర్‌తోపాటు సుమారు 500 మంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల జీవితాలకు ధీమా కల్పించాలి


పోస్టుకార్డుల ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న సంతోష్‌కుమార్ తదితరులు

సిరిసిల్లటౌన్: నిత్యం ప్రజాసంక్షేమానికి వార్తలతో కుస్తీ పడుతూ, ఆర్థిక లేమితో ఇక్కట్లలో పస్తులుంటున్న జర్నలిస్టుల జీవితానికి ప్రభుత్వం ధీమా కల్పించాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు శనివారం జిల్లా పోస్టాఫీస్ ప్రాంగణంలో సీఎంకు పోస్టుకార్డులతో వినతుల ఉద్యమ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఉద్యోగం, ఆరోగ్యం, అంశాల్లో భద్రత కల్పించాలని కోరారు. అర్హులకు ఉచిత ఆరోగ్య బీమా, నివేశన స్థలాలను వెంటనే కల్పించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన జర్నలిస్టులను ప్రభుత్వం పట్టింపులేకుండా చూడొద్దని, వెంటనే తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంబోజు ముత్యం, నాయకులు గంగు సతీష్, మహేష్, హరి, జంగిలి రాజు, దయానంద్, గోపి, ఆనంద్, అశోక్, శ్రీనివాస్, విష్ణుప్రసాద్, రమేష్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటాం

- సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి
- దెబ్బతిన్న పంటల పరిశీలన


దెబ్బతిన్న పంటలు పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని అండగా ఉంటామని సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట శివారులోని తిమ్మాసికుంటకు గండి పడడంతో దిగువన ఉన్న 100 ఎకరాల పంట పొలాలు నీటమునిగి ఇసుక మేటలు వేశాయి. దెబ్బతిన్న పంట పొలాలను కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. వేలాది రుపాయలు పెట్టుబడులుగా పెట్టి పంటలను సాగుచేయగా నీట మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని తహసీల్దార్ జయంత్‌కుమార్, ఏవో భూంరెడ్డిలతో మాట్లాడినట్లు తెలిపారు. పంటనష్టాన్ని సర్వే చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. నంది కిషన్, వద్నాల రాజు, రాగుల హరీష్, శంకర్ ఉన్నారు.

గుడుంబా స్థావరాలను నివారించండి

- ఎక్సైజ్ అధికారులకు బీజేవైఎం వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అక్రమ బెల్ట్‌షాపులు, గుడుంబా స్థావరాలను నివారించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు మెరుగు జితేందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు శనివారం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని, అదే విధంగా గుడుంబా స్థావరాలు కూడా యథేచ్ఛగా నడుస్తున్నాయన్నారు. గుడుంబాకు బానిసలై ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలకిషన్, అరవింద్, శ్రీకాంత్, సనత్, అనిల్, దిలీప్ ఉన్నారు.